# శేషించిన కీర్తి

"ఆనందరావుగారు అకస్మాత్తుగా మరణించటం వలన మనదేశం, మనరాష్ట్రం, మనజిల్లా, ముఖ్యంగా మన గ్రామం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందనటంలో అతిశయోక్తి యేమీ లేదు.

"ఆయన నిరాడంబరత్వము వాక్చాతుర్యము, వదాన్యత ఎన్నటికీ మరపురానివే.

"ఆ పరిపూర్ణ పురుషుణ్ని మళ్ళీ మనం చూడలేము. కాని ఆయన చేసిన ఘనకార్యాల్లోనే ఆయన చిరంజీవి అయిపోయాడు. నిజానికి ఆ ఉదార స్వభావునివలన యెన్నెన్ని కుటుంబాలు ఉద్ధరింపబడ్డాయో యెంత మంది వ్యక్తులకు నిలువ నీడ ప్రసాదించారో చెప్పటంకష్టం.

"మన దేశంలో నానాటికి పెరుగుతూ వస్తున్న నిరుద్యోగ సమస్యను ఆయనగారు ఆత్మవిశ్వాసంతో, అచంచలమైన దీక్ష

తోనూ ఎదుర్కొని ఎంతోమందికి ఉపాధి కల్పించారు. ఆయన ఉదారస్వభావాన్ని విడమర్చి చెప్పటానికి నాదగ్గర మాటలులేవు. ఆయన కట్టించిన పాఠశాల, ఆసుపత్రి, ధర్మసత్రం ఒక్కొక్కటి ఆయన గొప్పతనానికి నిదర్శనాలు. మనఊళ్ళో పెద్దలందరూ కలిసి అలాటి ఆనందరావుగారి శిలావిగ్రహాన్ని అంకమ్మ చెట్టు దగ్గర ప్రతిష్టించాలని చేసిన నిర్ణయం యెంతైనా సముచితంగా వుంది. దాంతోపాటు ఆయన ఆశయాలను, వారుఅసంపూర్తిగా విడిచిపోయిన కార్యకలాపాల్ని, మనం చేపట్టి, ఆయన ఆత్మకు శాంతి చేకూరిస్తే ధన్యులమవుతాం. అంతేగాని కేవలం, శిలావిగ్రహం ప్రతిష్ఠించి సంతృప్తి పడితేచాలదు....''

"సార్! ఇంకేం రాయమంటారు'' కళ్ళజోడులోంచి రెండు కళ్ళూ ఉరుముతు ఆనందరావు మొహంలోకి చూశాడు పరబ్రహ్మం.

ఆనందరావు కూడా పరబ్రహ్మం వంకే నిశ్చలంగా చూస్తూ, ఆలోచనగా తలవూపాడు.

'నాకు తోచింది రాసేశాను.. ఇంక తమరు చెపితే....'అంటూ నీళ్ళు నమిలాడు పరబ్రహ్మం.

'పరబహ్మం....'బరువుగాపిలిచాడు ఆనందరావు

'అయ్....'

పరబ్రహ్మం నిర్విణ్ణుడయాడు విల విలలాడిపోయాడు. కాస్తంత తెరిచిన నోరును అట్లాగే వుంచేసి కదలక మెదలక ఆనందరావు వంక చూస్తున్నాడు. కనుబొమ్మలు దగ్గరకు వస్తున్నాయి. నుదురు మీద ముడతలు సమానాంతర రేఖలులాగ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఉన్నట్టుండి అమాంతం వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టాడు ఆనందరావు.

పరబ్రహ్మం ఆనందరావు కంటె గుండెనిబ్బరం కలవాడు. పరబ్రహ్మాన్ని చూసే ఆనందరావు కూడా బింకంగా వుండటం నేర్చుకున్నాడని కొంతమంది అంటారు.

అయితే పరబ్రహ్మం ఒంటరిగా కూర్చుని ఆలోచించుకుంటున్నప్పుడు ఆనందరావు అంత నిబ్బరంగా యెట్లావుండగలుగుతున్నాడబ్బా అని ఆశ్చర్యపోతూ వుంటాడు కానిఆశ్చర్యం ఆయున మనసులోనె వుండిపోతుంది. పైకి తొణకడు. ఆయునచిరునవ్వు ఆచి ఆచి మాట్లాడటం ఆనందరావుకు. చాలా యిష్టం.ఎంతటిక్లిష్ట సమస్యనైన ఇట్టేపరిష్కారంచేస్తానన్నట్లు తలవూపుతాడు. అయున మాటల్లో ఎంతో నిగూఢమైన అర్థం వుంటుందని ఆనందరావు విశ్వాసం. పరబ్రహ్మం మీద ఆనందరావు కున్న నమ్మకం చాలా అతీతమైనది. ఇద్దరి యొక్క అన్యోన్యత పరస్పర గౌరవంచూసి, చాలామంది అసూయపడుతూ వుంటారు. ఆనందరావు జీవిత రహస్యాలు పరబ్రహ్మానికి మాత్రమేతెలుసని, ఆవూళ్ళోవాళ్ళు అనుకుంటూవుంటారు.

'పరబ్రహ్మం.... ఎందుకనోయ్ నా అంతరంగిక వ్యవహారాలు నీతోచెప్పందే వుండలేకపోతున్నాను' అని నింపాదిగా ఆనందరావు అన్నాడు "అది కేవలం నా అదృష్టంగా భావిస్తున్నా"నని ముక్తసరిగాఅనేసి వూరుకున్నాడు పరబ్రహ్మం.

ఆనందరావు తలవూపుతూ తనను పొగడిన పద్ధతిని మెచ్చుకున్నాడు.

ఎప్పుడో రాజధాని నగరం వెళ్ళినప్పుడు ఆనందరావు మాటల సందర్భంగా తనకొక నమ్మకమైన సెక్రటరీ కావాలనటం, ఆయున

దూరపు బంధువు ఒకాయన పరబ్రహ్మాన్ని పరిచయం చేయటం ఆనాటినుంచి కూడా యిన్నిసంవత్సరాలు పరబ్రహ్మం ఆనంద రావునే అంటిపెట్టుకుని వుండటం అంతా చాలావిచిత్రంగాతోస్తుంది. ఆనందరావు యీ విషయాన్ని ఎన్నోసార్లు ప్రస్తావిస్తూ వుంటాడు ఇది కేవలం దైవఘటన అని పరబ్రహ్మం సమాధానం చెపుతూ వుంటాడు

ఆనందరావు, ఎన్నో విషయాలను దాపరికం లేకుండా, నిర్మొహమాటంగా పరబ్రహ్మం ముందర చర్చించినప్పటికి, పర బ్రహ్మానికి యింకా అనుమానమే. ఏవో కొన్ని రహస్యాలు, ఆనంద రావు దాచివుంచాడని, అయితే ఈయన అడగడు ఆయన చెప్పడు.

నిజానికి ఆనందరావు రహస్యాల పుట్ట. ఆయన యెక్కడికి వెళతాడో, యేం చేస్తాడో, ఆ యింట్లో ఎవ్వరికి తెలియదు. అడిగి అడిగి విసుగుపుట్టి మెదలకుండా వూరుకుంది ఆయన భార్యసుభద్ర. ఆమె చనువు తీసుకునే సమయంలో కూడా ఆనందరావుతొణకలేదు.

ఎక్కడో కుగ్రామంలో మారుమూల బడిపంతులుగా బ్రతకాలసిన ఆనందరావు సొరతీగలాగ ఎగబ్రాకి, పందిరంతా చుట్టేసుకుని ఆరుపూలు నాలుగు కాయలతో రెండు అంతస్థుల మేడ అంతా ఆక్రమించు కున్నాడంటే, గిట్టనివాళ్ళు వెయ్యి మాటలు అన్నా నిజాన్ని తెలుసుకుందా మనుకున్న వాళ్ళంతా ఆ శ్చ ర్య పో తూ వుంటారు. ఎక్కడ భట్టిప్రోలు, ఎక్కడ హైదరాబాద్! స్కూలు టీచరు పని చేస్తూ ఉపాధ్యాయుల సంఘానికి సెక్రటరీ అయి, అధ్యక్షుడు హఠాత్తుగా పోవటం వలన ప్రెసిడెంటయి, హైదరాబాదుకు వెళుతూ వస్తూ, న్యాయశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించి

ఒకనాడు అమాంతంగా టీచరు పదవికి రాజీనామా ఇచ్చి, హైదరా బాదులో పేరుపడ్డ న్యాయవాది ఆఫీసులో గుమాస్తాగా చేరి తానూ ఒక మనిషినే అనిపించుకున్నాడు.

అయితే ఆ టీచర్ల యూనియన్ వాళ్ళు, రిజిస్టర్డ్ నోటీసు యిచ్చి సెక్రటరీగా, ఆనందరావు వసూలు చేసిన డబ్బుకు లెక్క చెప్పమంటే, పేరి శాస్త్రిగారి చేతే రిప్లయి నోటీసు యిప్పించి, పైగా పరువునష్టం దావా వేయించి, మూడువేల నష్ట పరిహారం పుచ్చుకున్న ఆనందరావు తెలివితేటలను, ఆప్లీడరు పేరి శాస్త్రిగారు యెంతో మెచ్చుకున్నాడు. "ఆనందరావుది గొప్ప బుర్ర" అని శ్లాఘించాడు.

అయితే ఆనందరావు, చిల్లర డబ్బులకు తబ్బిబ్బులయ్యే వాడు కాదు. ఓకంట కనిపెడుతూ వుండి, పేరి శాస్త్రిగారికి మహా అంతరంగికుడయి, చివరికి ఆయన యావదాస్తి కైంకర్యం చేసి పేరిశాస్త్రిగారికి మతిచలించేట్లుచేశాడు పేరిశాస్త్రిగారి కూతురి పెళ్ళికి, నలుగురూ తెలుసు కునేటట్లుగా బాహాటంగా అయిదువేల రూపాయలు ఖర్చుపెట్టి, తన కృతజ్ఞతను, ఈ విధంగా తీర్చుకో గలిగానని, కళ్ళనీళ్ళు పెట్టుకున్నప్పుడు, మంగమ్మ మెటికలు విరిచింది. 'వీడిమూలానే గదా నిక్షేపంలాంటి ఆస్తి కాస్త పేరిశాస్త్రి పోగొట్టుకున్నాడని' అయితే ఆ మెటికల చప్పుడు ఆనందరావుకు మాత్రమే వినిపించింది. ఇవన్నీ తలుచుకుంటుంటే గుండె చెరు వయిపోతుంది ఆనందరావుకు. 'పరబ్రహ్మానికి ఇన్ని రహస్యాలు చెప్పాను. వీడు కొంపతీయడుగదా' అని అనుకుంటూ వుంటాడు. కాని పరబ్రహ్మం నిజాయితీని శంకించాలసిన అవసరం, అవకాశం ఇంతవరకు ఆనందరావుకు రానేలేదు.

కాని ఈ నాడు దుఃఖము అపుకోలేక పోయాడు. వెక్కి వెక్కి యేడుస్తుంటే పాతవన్నీ గుర్తుకొచ్చి కలవరపడిపోతున్నాడు. తన జీవితము సమాప్తి అయిపోతోంది అనే భావన ఆయన్ను వణికించేస్తోంది. చేతులారా నిండుప్రాణాన్ని తీసుకోవటం మహాపాపం అని, ఆత్మహత్య చేసుకోవాలసిన అవసరం నిజంగావుందా అని మథన పడుతున్నాడు.

జ్యోతుల్లాంటి రెండుకళ్ళను చూస్తూ, ఆనందరావు వాల కాన్ని తీక్షణంగా పరీక్షిస్తూ, పరబ్రహ్మం గుటకలు వెయ్యటం మొదలుపెట్టాడు. ఏమీ మాట్లాడలేక పోయాడు. ఇంతచేటుగా ఎందుకు బాధపడుతున్నాడా అని, ఆశ్చర్యపోతున్నాడు. పెదిమలు ఎండిపోయినాయి. నాలుకతో పెదమల్ని తడుపుతూ, మాటలను బైటకుపంపటానికి తంటాలు పడుతున్నాడు. పరబ్రహ్మం అక్షరాలు ఎండిపోయి పెళుసుగా విరిగి ముక్కలయి కింద పడిపోతున్నాయే కాని, ఒకదాని ప్రక్కన ఒకటి నిలబడటంలేదు. భావమంతా అట్లాగే మూగగా వుండిపోయింది

పరబ్రహ్మం మనోవేదనను ఆనందరావు గ్రహించాడు. అయితే ఆయనేమీ అనలేదు. వద్దు వద్దు అని ఎన్నిసార్లు బ్రతిమాలినా, ఇప్పుడు గత్యంతరం లేదు. ఆత్మహత్యే శరణ్యమని గట్టిగా నొక్కి చెప్పినవాడు ఆనందరావే. ఇన్‌కమ్‌టాక్సు విషయము నేను చూసుకుంటా నని, ఆ బాకీలవాళ్ళకు సర్దిచెప్పే బాధ్యతనాదేనని, మీ మీద కూనీకేసు రాకుండా, నేను చూస్తానని పరబ్రహ్మం యెన్ని విధాల చెప్పినా, ఆనందరావు మనస్సు ఆగలేదు

"నీకు తెలీదు పరబ్రహ్మం, నా పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు. ఎవరో నన్ను శిక్షించక్కర్లేదు. నా అంతట నేనే యీలోకం

లోంచి వెళ్ళిపోతాను" అని కృతనిశ్చయుడై, ఆయన పరబ్రహ్మానికి తన నిర్ణయాన్ని చెప్పాడు. తానుపోయిన తర్వాత లోకం యేమనుకుంటుందో, కాస్తంత చెప్పమంటే, పరబ్రహ్మం, తనకు తోచిన రీతిగా రాసి, ఆయనకు చదివి వినిపించాడు. అది విన్న తర్వాత, ఆనందరావు గుండె నిబ్బరం చలించింది. మనస్సు విలవిలలాడి పోయింది ఉద్వేగాన్ని, ఆవేదనను ఆపుకోలేకపోయాడు అమాంతం పైకివచ్చేసింది. ఆయన భళ్ళున ఏడ్చాడు. పిరికివాడయిపోయాడు పరబ్రహ్మాన్ని చూస్తుంటే ఆయన మరీ భీరువయి పోతున్నాడు. అయితే పరబ్రహ్మం మనస్సు కూడా చంచలమయిపోతోంది.

ఆనందరావు చనిపోయిన తర్వాత లోకం ఆయన్ను గురించి ఏమనుకుంటుందో, పరబ్రహ్మంచేత రాయించి మరీ చదివించుకున్నాడు. పాపం పరబ్రహ్మం రాసి చదివాడు. ఆనందరావు, సంతృప్తిగానూ సంతోషంగానూ హాయిగానూ, ఆనందంగానూ వుంటాడని ఊహించిన పరబ్రహ్మానికి చాలా నిరుత్సాహం కలిగింది. ఆయన అంత చేటుగా ఏడుస్తాడని పరబ్రహ్మం ఊహించలేకపోయాడు.

పరబ్రహ్మం ఆయనకు ఆంతరంగికుడే రెండు తెల్ల కాగితాలమీద ఆనందరావు సంతకాలు చేసి యిచ్చిన ఏడాదికి మళ్ళీ, ఆ కాగితాలు తెచ్చి, ఆయన ముందే చించి పోగులుపెట్టి పరబ్రహ్మం తన నీతిని, నిజాయితీని రుజువు చేసుకున్నాడు. ఏ విషయమైనా, పరబ్రహ్మం ముందర దాచడు అనే భావన కలిగించాడు కానీ ఈనాడు ఇంత చేటుగా ఏడవటం పరబ్రహ్మం ఊహించలేకపోతున్నాడు. ఆనందరావు మనసులో ఏదో ఆలోచన ఉన్నదని తనకు చెప్పలేదని, మథనపడుతున్నాడు పరబ్రహ్మం.

'ఆత్మహత్య ఘోరపాపంకాదు....' కళ్ళనీళ్ళు తుడుచుకూంటూ ఆనందరావు అంటుంటే, పరబ్రహ్మం కాళ్ళూచేతులు ఆడలేదు.

"అవున్లే నేనుచేసిన పాపాలకంటె యిదిఘోరం కాదంటావు అంతేగా!...." బరువుగా అంటూ ఆనందరావు పెద్దగా నిట్టూర్చాడు.

పరబ్రహ్మం గిజగిజ లాడాడు.

"నేనెప్పుడూ అంతమాట, అనేవాన్ని కాదు. యెన్నిసార్లు యెన్ని విధాల నచ్చచెప్పినా వినలేదు. ఇప్పుడు మించిపోయిందేమీలేదు, మీరు మాత్రం ఆత్మహత్య చేసుకోవద్దు..." గద్గదంగా అన్నాడు.

"నీకు తెలీదు పరబ్రహ్మం నామీద అభిమానం గౌరవం కొద్దీ అలా అంటున్నావేకాని నేనీలోకంలో ఒక్క క్షణం వుండలేను. ఎటూ తప్పించుకోలేను. లోకంముందర నేనొక నేరస్థునిగా, హంతకునిగా బ్రతకలేను... కాని చావంటే భయమేసి చిన్న పిల్లాడిలాగ ఏడ్చాను. అంతే... ఇప్పుడు నాకు ధైర్యం వచ్చేసింది గుండె నిబ్బరంగా వుంది, నువ్వేమీ అడ్డు చెప్పవద్దు...." హుందాగా అన్నాడు.

పరబ్రహ్మం నోటమాట రాలేదు.

"పరబ్రహ్మం.... నువ్వు రాసింది బాగానేవుందికాని, దాంట్లో చివ్వరికి కొన్ని నిజాలు కూడా రాస్తే బాగుంటుందనుకుంటాను"... కళ్ళు క్రిందకు దించి నేలవంక చూస్తున్నాడు.

ఆయన నోరు మెదపలేదు.

"ఆనందరావు లోకం అనుకున్నంత దుర్మార్గుడుకాదు.... సౌభాగ్యం కూతురుకి, అంటే నా కూతురుకన్నమాట, ఒక యకరం ాసియిచ్చా. వాసుదేవరావుగారి అబ్బాయి చదువుకింద అయిన ఖర్చంతా నేనే భరించా...." ఆనందరావుకు బాగా ఆయాసం వచ్చేస్తోంది. కళ్ళు తేలిపోతున్నాయి. వళ్ళంతా బిగుసుకుపోతోంది. గుటకలు వేస్తున్నాడు.

పరబ్రహ్మం మళ్ళీ తమాయించుకుని సమాధాన పడ్డాడు. అవును అనందరావు విషం తాగాడు. ఆత్మహత్య, చేసుకున్నాడు. అని లోపల లోపల గొణుక్కున్నాడు. గాభరాపడిపోయాడు. అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు. సావిట్లోకి వచ్చి చూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. మళ్ళీ గదిలోకి వచ్చి ఆనందరావు నాడి పరీక్ష చేశాడు. నాడి ఆడటంలేదు. గుండె ఆగిపోయింది. ఆనందరావు కీర్తిశేషుడయ్యాడు, అని గట్టినమ్మకం కుదరగానే పరబ్రహ్మం అమాంతం వాకిట్లోకి వచ్చేశాడు. ఎవరితో చెప్పాలో ఎలా చెప్పాలో అర్థంకాక తికమక పడ్డాడు. మళ్ళీ ధైర్యాన్ని పుంజుకుని గబగబ అడుగులు వేస్తూ బజారు వెంబడి అలసటగా ఆదుర్దాగా తిరుగుతు న్నాడు. ఇంతలోకి అమాంతం, ఆదుర్దాగా ఆనందరావు యింట్లో నుంచి పాలేరు పరుగెత్తుకుంటూ వస్తూ "అయ్యగారు పలకటం లేదండీ" అంటూ పొలికేక పెట్టాడు. పరబ్రహ్మం హడలిపోయి, ఆగిపోయాడు గభాలున వెనక్కుతిరిగి 'ఆఁ!' అంటూ గుడ్లప్పచెప్పి చూస్తున్నాడు. ఇట్టే నలుగురూ పోగయ్యారు. గబగబ గదిలోకి వెళ్ళారు, ఆనందరావు శాశ్వతంగా నిద్రపోవటం చూసి, ఆశ్చర్య పోయినవారు గాభరా పడ్డవారు రకరకాలుగా అనుకుంటున్నారు.

ఆ నోటా ఆ నోటా పాకిపోయి, కునికిపాట్లు పడుతున్న పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు చెవులోకి పోయి ఆయన్ను ఉక్కిరి బిక్కిరి చేసేసింది. ఒక్క అంగలోకి వచ్చేశాడు. పరబ్రహ్మం మహా గంభీరంగా నిలబడి పోయాడు. ఆ గదంతా సోదా చేస్తున్నారు ప్రతి వస్తువు విడివిడగా తీసి చూస్తున్నారు. పోలీసువారు ఆనందరావు పడుకున్న పరుపును దిండును పరీక్ష చేస్తుంటే ఒక కాగితంముక్క, ఇన్‌స్పెక్టర్ కళ్ళను ఆకట్టేసింది, హడావిడిగా ఆ కాగితాన్ని విప్పి చదివాడు.

"పరబ్రహ్మం నాకు కావల్సినవాడు అపుడు అయితే నేను ఆయనకు చేసిన నేరమేమిటో అర్థం కావటంలేదు. నాకు విషమిచ్చి, నన్ను కడతేర్చాలనే దురుద్దేశం మహా దారుణం.... అయినా నాకు ఆయన మీద కోపం లేదు, ఆయన్ను క్షమించమని కోరుతున్నాను.

ఇట్లు
ఆనందరావు.

"ఆఁ!...ఆఁ!...." అంటూ విస్తుపోయాడు. పరబ్రహ్మం, పోలీసు ఇన్‌స్పెక్టరు వంక భయంగా చూస్తూ!

—o—